# మంచి ముహూర్తం

శ్రీ బలివాడ కాంతారావు

వెంకట్రావు పాశ్చాత్య దేశాలు వెళ్లకపోయినా, వాళ్ల నాగరికతా, ఆచార వ్యవహారాలు, వాళ్ల జీవిత విధానాలు, కొంతలో కొంతైనా, సినీమాల ద్వారా, సాహిత్యం ద్వారా జీర్ణింప చేసుకొన్న మనిషే. నెలరోజులక్రితం గతించిన తన అర్ధాంగికీ తనకూ పేచీలు అప్పుడప్పుడూ రాటానికి దీనివలన బాధ్యుడు తనైనా ఆ పేచీలు వుఫ్ఫన తన లొంగుబాటుతో పూడేయటం ఆమె పనిగా వుండేది. జీవితము యెల్లప్పుడూ సుఖవంతం కాడానికి తను నోచుకోలేదంటే ఒకవిధంగా గృహిణిలో, ఆనాగరితలో తను ఆకళింప చేసుకొన్న గుణగణాలు యే మోతాదులోనైనా లేకపోవటమేనని విశ్వసించేవాడు. ఆమె చేస్తుండే పూజా పురస్కారాలు తనకు నచ్చేవికావు. ఆమె యెవరైనా స్నేహితులు వస్తే 'ట్రే' తీసుక వచ్చేదికాదు. తను కావలసినట్లు గృహాలంకరణ గాని, ఆమె అలంకరించుకోవటం గానీ చేసేది కాదు. తనకు కావలసినదంతా ఆమెలో లేదనీ విసుక్కున్నా తనకే గుప్తమైన హృదయాంతరాలంలో ఒక వెఱ్ఱి వూహ తాండవమాడేది. ఆ వూహ గాఢమైన కోరికగా ఒక్కసారి మాత్రం పరిణమించింది. ఆరోజు సరిగ్గా నాలుగేళ్లక్రితం విశాఖపట్నంలో తను ఒక దూరపు చుట్టాలింటికి అనుకోకుండా వెళ్లిననాడు, ఆ కోరికను స్పష్ట పరచుకున్నాడు. ఆ కోరికకు ఆ ముసలమ్మ విఘవకూతురు సరోజ కారణమైనా కొన్ని రోజులకు ఆ కోరిక మాసిపోయింది. దానికి కారణం తన బంధుజనం, తన అత్తవారికి వుండే డబ్బు. ఈ డబ్బు తన కెప్పుడో సంక్రమిస్తుందని లోలోన సంతోషపడ్డా, యీడబ్బువలనే తన భార్య అప్పుడప్పుడూ తనను యెదిరించటం కూడా జరుగుతుండేదని కించపడేవాడు.

మరచిపోయిన తన వూహ నాలుగేళ్లకు విధి వశంగా నిజమయ్యేసరికి, మళ్లీ తన కోరిక మలేరియా జ్వరంలా బయటపడింది.

భార్యకు రెండో పురుడు వచ్చి తల్లీ, పిల్లా చచ్చిపోయారని విజయవాడనుంచి నెలరోజులక్రితం ఆఫీసుకు మామగారిచ్చిన టెలిగ్రాం వచ్చినప్పుడు దిక్కుచచ్చిపోయాడు. కానీ తను తోడివాళ్ళు ధైర్యం చెప్పే లోగానే మనోధైర్యాన్ని తెచ్చుకున్నాడు. దానికి తను కొంత, జీర్ణింపజేసుకొన్న పాశ్చాత్య నాగరికత మెరుపులాంటి యింకో తలపు సహాయపడ్డాయి. యిల్లాలు యిక లేదు— కానీ వెంకట్రావ్‌లో పాతకోరికకు మొలకెత్తడానికి సరియైన పరిస్థితులు వచ్చాయ్. తను నలుగుర్ని పోషించగల శక్తిమంతు డిప్పుడు. తనకు యిల్లువుంది. మామగారిమీద ఆధారపడవలసిన అవసరం, తనకేమీ లేదు. తను మళ్లీ యిప్పుడు పెళ్లిచేసుకోడానికి అడ్డంకు లేమీ లేవు. ఇలాంటప్పుడు హైందవ శాస్త్రాలమీద గౌరవం యేర్పడింది. ఎంచేతంటే భార్య చచ్చిన పదమూడో రోజునే మళ్లీ ఆ మగవాడు పెళ్లి చేసుకోవచ్చని అవి ఘోషించాయ్. తన నాలుగేళ్ల కొడుకును పెంచే బాధ్యత తనదికాదు. మామగారి ఆస్తి పాస్తులకు వారసుడు వాడు.

తన రెండో వివాహం తన యిష్టానుసారం కాకపోడానికి యెటువంటి అడ్డంకులూ లేవు; ఇక వున్న అడ్డంకులంతా పెళ్లికూతురిదే. దీనికోసమే ఆలోచించి ఆలోచించి విశాఖపట్నం వెళ్లటానికి ఒక మంచిముహూర్తం నిర్ణయించుకున్నాడు. పూర్తిగా పాశ్చాత్యుల అడుగుజాడల్లో నడిచే హైందవులకుకూడా యీ ముహూర్తాల నమ్మిక వుండేటప్పుడు వెంకట్రావ్‌లాంటి మనిషికి యీ నమ్మిక వుండటంవలన ఆయన సంస్కారానికేమీ తలవంపు కాదు. ఏలాంటినాస్తిక వాడైనా జీవితంలో ఒక్కసారైనా దేవునితలంచకపోడు. నమ్మికకు అతీతుడైన మనిషంటూ ప్రపంచంలో వుండడు. ఎంచేతంటే

ఆహారములో పిండి పదార్థం యెలాంటిదో మనిషి అనుభూతుల్లో నమ్మిక అలాంటిది.

రేపు పదిగంటలకు మంచి ముహూర్తం. అన్ని విధాలా దివ్యమైన ముహూర్తమని శాస్త్రిల్లుగారు నొక్కి చెప్పారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా వెళ్లి విశాపట్నంలో వ్రాలి తీరాలని వెంకట్రావ్ భీష్మించుకున్నాడు.

ఈ రాత్రి యెంత ప్రయత్నించినా నిద్ర రావటంలేదు. ఆరేళ్ళపైగా ఆ మంచంమీదే తన గతించిన భార్యతో నిద్రపోయాడు. తన ఆనందం, సౌఖ్యం శాంతికోసం నమ్రతతో ఆమె తలవంచి రాత్రనక పగలనక కష్టపడి సర్వస్వాన్ని అర్పించుకుంది. కొడుకు వుయ్యాలలో గోలపెట్టిన రోజుల్లో ఆగదిలో తన అసహనం యెదుట ఆమె యెంతో సహనాన్ని ప్రదర్శించింది. నిండు హృదయంతో, నిండు ముఖంతో కొడుకు యేడుపుకే మురిసిపోయే ఆ మాతృశ్రీ జోలపాట నిజానికి వెంకట్రావ్ చెవుల్లో గింగురుమనిపించి తన కళ్లలో నీరు కార్పించ వలసింది. కానీ వెంకట్రావ్‌లో యీ నిముషాల్లో ఆ అనుభూతుల్లేవు. విసిగి పెళ్లానికి విడాకులిచ్చి యింకో యువతి గాఢా లింగనంలో మునిగిపోయిన వాని మళ్ళే మురిసిపోతున్నాడు. ఆ మంచంమీద కొద్దిరోజుల్లో తన ఆరాధ్య దేవత మనోహరంగా వ్రాలిపోతుంది—కాదు! ఆయన మనోవీధిలో ఆమె వ్రాలిపోయివుంది. ఒక తియ్యని వూహకు మధ్యగా ఒక గాఢమైన నిట్టూర్పు విడిచినట్లు భ్రమపడి యిటూ అటూ చూసి లేచాడు. చల్లని గాలి, ప్రశాంత వాతావరణం, తన మేడవెన్నెలలో వెలిగిపోతోంది. పలుకులేని రాచిలుకను ప్రేమతో పచ్చని పూలచెట్లలో వెన్నంటుతున్నాడు. తళుక్కుమని మెరుస్తున్న తన వలపు తలపులకు తెరలా ఒక విషయం అడ్డువచ్చింది. తలెత్తి చూశాడు. మబ్బు కప్పిన చందమామ కనిపించాడు.

వెంకట్రావు నాలుగేళ్లక్రితం విశాఖపట్నంలో చూసిన వెంకమ్మ అవిడ విధవకూతురు సరోజి యింకా అక్కడే వుంటారా? లేకపోతే ఒకప్పుడు సరోజ చదువుకుంటోంది గదా! ఆమె ఒళ్లు పొందిక అందచందాలతో యెవరినైనా ఆకర్షించ గలుగుతుంది. అలాంటప్పుడు యెవడైనా ముందుకు రాడా? ఈ తలపే తన నిస్పృహకు కారణమైంది.

కల్ల నిజంగా తీసుకొని మురిసిపోయే టప్పుడు అడ్డుగా వచ్చే వూహల్ని ఛేధించటానికి అన్ని తెలివితేటల్ని వుపయోగించటం మానవునికి పరిపాటి. జీవితం అంతా ఆనందాన్ని, సౌఖ్యాన్ని కాంక్షించటం మానవుని లక్షణం. ఈ ఆనందాన్ని, సౌఖ్యాన్ని తన కష్టాలవలనే పొంది ఫలింపజేసుకున్నాడనేది యెవరూ గుర్తించటానికి సాహసింపరు.

వెంకట్రావ్ మరికొన్ని వూహలని కత్తిదూసినట్లుగా మనసులోనికి చొప్పించాడు. మళ్లీ మొదటి వూహల్లో నిండుకున్న మనసుతో తలెత్తేసరికి మబ్బు మెల్లగా జారిపోయి చందమామ చల్లని హాసాన్ని వెదజల్లింపజేసింది. మళ్లీ తన కోరికకు చలనం లేనట్లుగా వూకొట్టూ నిల్చున్నాడు.

ఒక సుందరమైన ప్రకృతి దృశ్యాన్ని, ఒక అందకత్తె చూపు నీ మనసులోనించి వేగంగా తుడిచిపెట్టడం యౌవ్వనంలో జరిగేపని కాదు. కరుడుకట్టిన శాస్త్రిల నమ్మిక నల్లమందులా పనిచెయ్యొచ్చు. కాని ఒంట్లోవున్న ఆ జబ్బునుమాత్రం ముట్టుకోలేవు.

నాలుగేళ్ళక్రితం తలవని తలంపుగా ఒక స్నేహితునితో వెంకమ్మ యింటికి వెళ్ళేటప్పుడు ఆమె గోత్రాలనుంచీ గుంటకాయలవరకూ ఘాట్లాడినా తను ఆ గదిలో ఒకమూల వుబికివచ్చే పదహారేళ్ళ యౌవ్వనంతో తొణికిసలాడుతున్న సరోజవేపు చూస్తూనేవున్నాడు. ఆమె ముఖకళ, శరీరపుపొందిక, నడత పరిశీలించే అవకాశం తనకుకలిగినందుకు యెంతో గర్వపడి ఆమెయొక్క సౌందర్యరేఖ చూచి, పాపిష్టి సంఘంలో ఆమె వుండరాని గంధర్వాంగన అనుకున్నాడు. అప్పుడే తను బ్రహ్మచారియైయుంటే...కాదు...తన చెప్పచేతలలో లేని అందం లేని భార్య కాస్త—ఈ రెండోది వూహామాత్రంగానే వుండిపోయింది. ఎంచేతంటే సాంఘికవిద్య—మనిషి గొర్రెకాదు, మనసూ మేధస్సూ వుపయోగించుకొని, మంచిచెడ్డల తీర్పుకు అంతరాత్మ వున్నవాడని తెలియజేస్తుంటుంది.

వెంకమ్మ తను కోరి ఛేదించుకుంటున్న ఆలోచనలకు అతుకుతూ జీవంపోసినట్లుగా సరోజ ప్రసక్తి తెచ్చి అన్నది: "చూడు నాయనా! నేను కళ్ళు మూస్తే దాని గతేంగాను. అందుకే చదివిస్తున్నాను!

ఏం ఆస్తిపాస్తులున్నాయ్ నాయనా బతుకుతుందన డానికి! ఎవరు అక్కరచేస్తారు దానికి. ఏదో...!

వెంకట్రావ్ శరీరంఅంతా పెళ్ళి అని ప్రతి ధ్వనించింది. ఆ ఒక్క నిముషం తన అంతరాత్మ లేదులేదు అని ఘోషించి మరీ తన ఆలోచనలకు దారంవిడిచిపెట్టిన గాలి పడగడలా వదిలేశాడు. సిగ్గు, లజ్జ, బిడియం, వదలి హాసవదనంతో సరోజ వేపు వుత్సాహంగా చూశాడు. సరోజ యెవరు? యెవరు?...?

నా భార్య!... పైకొచ్చే పెద్ద నిట్టూర్పు లోనికి అణచుకోవటంతో గాలి పగడదారం తెగి పోయింది. వాలిపోతున్న గాలిపగడలా ముఖమే కాదు శరీరంఅంతా వంచేశాడు.—

వెంకట్రావ్, నాలుగేళ్ళ తరవాత యీ రాత్రి మగత నిద్దరకమ్ముతుంటే ఆవులింతలుతీసి "నాలు గేళ్ళక్రితమేనా భార్య చచ్చిపోయివుంటే" అను కున్నాడు.

౨

వేకువఝామునే తెలివివచ్చింది. నవ్వుతూ లేచి లైటువేసి పాలుకుర్చీమీద కూర్చొని సిగరెట్ వెలిగించాడు. ఎదురుగా భార్య ఫోటో నవ్వుతూ కనిపించింది. తన మనసులో ఒక వూహ తన ఆజ్ఞ లేకుండా దొర్లుకురావటంవలన ముఖంకోరి ప్రక్కకు త్రిప్పివేశాడు. బహుశః చనిపోయిన భార్య ఆత్మ ఆ ప్రశ్న వేసివుంటుంది. తెగిన గాయానికి వెంటనే సున్నం తగిలించినా రక్తం చిమ్మకమానదు. లేచి పోయి వరండాలోనికి వచ్చేసి యిటూఅటూ వడిగా పచారుచేశాడు. ఆ గదిలోనికి వెళ్ళటానికి ప్రయ త్నిస్తే ఆ గదంతా ఆ ప్రశ్నతోనే ప్రతి ధ్వని స్తోంది. మళ్ళీ తలగోక్కొని గదిలో కాలుపెట్టి సిగ రెట్టుపెట్టే అగ్గిపెట్టి తీసుకొని సిగరెట్‌మీద సిగ రెట్ ముట్టిస్తున్నాడు. సిగరెట్‌పెట్టె, అయిపో యింది. కానీ ఆ ప్రశ్న ప్రతి కణంలోనికి ప్రాకి పోయి ప్రతి ధ్వనిస్తోంది. ఆవేశంతోపాటు బాధ ముల్లులతో పొడిచివేస్తోంది.

వెంకట్రావ్ తూరుపు తెలతెలవారటంతో సాహసించి గదిలోనికి వెళ్లాడు. భార్య ఫోటో యీసారి మరీ గట్టిగా పరిహసించి ప్రశ్న వేసింది... "నాలుగేళ్ళక్రితం మీరే చచ్చిపోయివుంటే..."

గదిఅంతా శూన్యం—శూన్యంలో యేకువు. ఆనిముషములో చచ్చిపోయిన తను చూస్తున్నాడు! సరోజలా తనభార్య చదువుకుంటోంది...ఎవడో యువకుడు చూస్తున్నాడు. లేదులేదు చదవటానికి వీల్లేదు—నా పేరు నిలబెట్టడానికి పురాణాలు, వేదాంతం చదువుతోంది... వెంకట్రావ్ మళ్ళీ కళ్ళువిప్పాడు. ప్రపంచం వెలుగుతోంది. వెలుగున్న ప్పుడే అన్నీ చక్కబెట్టుకోవాలి. వెలుగుండేటప్పుడు కళ్ళు గట్టిగా మూసుకొని చీకటి చేసుకోటం వెఱ్ఱి తనం! కనిపించే సత్యాన్ని సౌఖ్యాన్ని విడనాడి కనుపించని సుఖాలకోసం, సత్యంకోసం వెతుక్కో వటం మానవుని మనుగడకే ప్రమాదం. జీవితంలో ఆదర్శాలకీ, ధర్మపన్నాలకీ, త్యాగానికీ ఒక హద్దు అంటూ వుండాలి. తనజీవితంలో వీటిని ఒక హద్దు పెట్టుకొనే యిప్పటివరకూ అమలుపరచాడు. చచ్చి పోయిన మనుషులకు ద్రోహంతలపెట్టామనుకోవటం మన వెఱ్ఱితనాన్ని సూచిస్తుంది సంఘంలో నిషేధింప బడటంవల్ల, గొప్ప అందమైన పూలచెట్టు మొరుడై యింది. అది చిగిర్చి పుష్పించి, ఫలభరితంచేసి మనో హరమైనదిగా ప్రపంచానికి అందివ్వబోతున్నాడు తను. ఈ మహా కార్యానికి, యీ పుణ్యానికి యెవ రడ్డువచ్చినా ఆగేదిలేదు — ఆగేవాడుకాదు. ఆ ధైర్యంతోనే తను మేడదిగిపోయాడు.

కావలసిన సరంజామాతో స్టేషనుకు బయలు దేరాలని యింటికి తాళంవేస్తుండగా తపాలా బంట్రోతు యెదురై వుత్తరం అందించాడు. జట్కా యెక్కేముందు కవరుచింపి 'హోనీవోయ్' అన్నాడు. జట్కా కదులుతోంది. ఉత్తరం చదవటం పూర్తి చేసి కోటుజేబులో చిరాకుగా కుక్కాడు. మళ్లీ ఆ వుత్తరాన్ని చింపేయాలని తీశాడు. అది చేతులో నలిపిన వుత్తరాన్ని మళ్లీ పారవేయలేకపోయాడు.

జట్కావాడు చక్రానికి కొంచం తగిలించిన కొరడాకర్రవలనవుత్పన్నమైనశబ్దంతో విసుక్కొని ఆగ వోయ్ అని అరచాడు. జట్కావాడు జట్కా ఆపుతూ వెనక్కు చూసేసరికి వెంకట్రావ్ అప్పుడే జట్కాదిగి పోయి యెదరగా వున్న కాఫీహోటల్లోకి వెళ్లాడు.

కొంత సేపటికి రుమాలుతో ముఖంమీద

చెమట ఒత్తుకుంటూ వచ్చి జట్కామీద కూర్చున్నాడు. జట్కా వడిగా పోతోంది!

కాఫీ కడుపులో పడటంతో తనొక నిర్ధారణకు రాగలిగాడు. ఎప్పుడైతే తను సరోజను పెళ్లి చేసుకోడానికి నిశ్చయించాడో, యిక తన కొడుకు ఒక్కడే తన ఆస్తికి వారసుడు కాడు తన ఆస్థి పాస్థులకు వారసు లింకా పుట్టవలసివుంది. కొడుకు బాగు ఓగులు చూసి శ్రమపడి చివరకు సుఖపడేవారు తన మామగారు. ఆయన భార్యనూ. ఆయనలో సహజంగా వుండే మమకారం కొడుకుయందు వెల్లువలా ప్రవహించలేక పోవటమే యీ నిశ్చయానికి కారణం.

— మమకారం లేని మనిషిగా తను వర్థిల్లడానికి కారణం తన భార్య అని నిందించటానికి కూడ సాహసిస్తాడు. పిల్లలకు అతీతమైన ముద్దుతో పెంచటం, చివరకు దద్దమ్మలను చెయ్యటానికేనని ఆయన వూహ. భార్య యందుండే యీ యీర్ష్య యొక్క ఫలితం కొంత కొడుకు వరకూ యీ ప్రాకింది. ఉండే జ్ఞానాన్ని విప్పి ఆలోచించుకోడానికి యింకో స్త్రీయందుండే మోహం అడ్డుగా బలంగా వుంది. తనలో నున్న మమకారం అంతా సరోజ దోచుకుంది.

వెంకట్రావ్ కొడుకు జ్ఞానం లేని చిన్న వయస్సు కాబట్టి తను జ్వరంతో బాధపడుతున్న యీ సమయంలో యింకేమీ ఆలోచించలేక "అమ్మా నాన్న" అని పలవరిస్తున్నాడు. ఆ అమ్మ అన్న పలవరింపును ఆకలివల్ల తల్లికోసం పరితపించే గోవుపిల్లలా వుండటంచేత, ముసలి ఆలుమగలు దుఃఖంతో ముద్దయి పోతున్నారు. ఇక ఆ కుఱ్ఱవాడు ఆత్రుతతో పలవరించే మనిషి యీ ప్రపంచంలో ఒక్కడే—ఆయన యీ విచారకరమైన వార్తని తెలియపర్చే వుత్తరాన్ని నలిపి సిగరెట్ పొగ వదులుతూ జట్కా మీద రాజమండ్రి స్టేషను చేరుకుంటున్నాడు.

స్టేషను చేరాక రెండుసార్లు బుకింగ్ కౌంటరు దరి దాపులకు వెళ్లి తిరిగి వచ్చాడు. బహుశః తనలో కాఫీ చొప్పించిన ధైర్యం వుత్సాహం దిగజారే సమయమేమో. ఐనా తను పెళ్లి చేసేదేముంది? డాక్టరు మందిస్తున్నాడు. సేవ చెయ్యటానికి యెందరు లేరు. అంత సీరియస్‌గా వుంటే టెలిగ్రామే యిచ్చి వుందురు. సరోజను కలుసుకోటానికి యింతకంటే మంచిసమయం ముహూర్తం దొరకటం దుర్లభం. తను విజయవాడ వెళ్తే కుర్రవాడి వంట్లోనయం అయ్యేవరకు వుండాలి. ఈలోగా అక్కడ యేమైనా సంబంధాలు వస్తే కావలసిన వారని మామగారు బలవంతం చేస్తేతను సరోజని విడిచి పెట్టవలసి వస్తుంది. తను అందర్ని యెదిరించే బదులు ముందుగా సరోజని కలుసుకొని అన్నీ స్థిరం చేసుకొని తరవాత విజయవాడ వెళ్లవచ్చునని నిర్ధారించుకోవటం, గంట మ్రోగటం కూడా జరిగింది. టిక్కెట్టు తీసుకొని ప్లాటుఫారంమీదకు వెళ్లాడు.

## 3

తాళం పడ్డయింటిని చూడగానే యింత వుత్సాహం వురిపెట్టుకుంది. ఆ నిముషంలోనే, ప్రక్కయింటి గుమ్మందగ్గర నిల్చున్న తన ఆరాధ్య దేవత అనుపించటంతో మళ్లీ బ్రతికాడు. చావుకు బ్రతుకులకు మధ్య యెంత ఆరాటం?

సరోజ వెంకట్రావ్‌ని పోల్చింది. ఆమె వేషధారణలో వచ్చిన మార్పు మనసులో పెట్టుకోలేదు గాని యీసారి ఆమె వెన్నెల్లో కలువ పువ్వులా వికసించిందని యెంతో తన్మయుడై పోయాడు. అందమైన ప్రతి వస్తువు నాగరికతా చిహ్నమే. ఈ నాగరికతా చిహ్నం తనదని ఆ చిహ్నాన్ని తన చెప్పు చేతల్లో వుంచి ఆరాధించి అనుభవించే సదవకాశం కొన్ని రోజుల్లోనే వుందని మురిసిపోతూనే యింటిలో కాలు పెట్టాడు. ఆ ఆశతోనే యెందరు చెప్పినా వినకండా, యీనాడు తలకు వాసననూనె రాసుకొని వుంగరాల జుత్తును అట్టే పెట్టాడు.

సరోజ అంగటి గదిలో అప్పుడే కుర్చీ వేసింది. సిగ్గు ఆడవాళ్ళ సహజమైన సొత్తు. సిగ్గులేకపోతే ఆడ వాళ్ళ అందానికి ముసుగులేదు. ఆ ముసుగు లేకపోతే మగవాళ్ళ ఆరాటమూ లేదు. వెంకట్రావ్ రెండోగది తలుపు చాటున నిల్చుని సిగ్గుతో తల వంచుకున్న సరోజవేపు చూశాడు.

మాటలు మొదలు పెట్టేముందు సిగరెట్ వెలిగించి మరీ, "అత్తయ్యగారేరీ" అన్నాడు.

కొంత సేపటివరకూ జవాబు లేకపోవటంతో ఆతృతగా సరోజవేపు చూశాడు. ఆమె చీరకొం

గుతా కళ్ళు తుడుచుకుంటోంది. దుఃఖం అనేది మమకారంపు ముద్దుబిడ్డ. కని, పెంచి ఆరాటపడి ప్రాణాల విడిచిన తల్లి ప్రసక్తి రావటంతో ఆమెలో దుఃఖం పొంగి పొరలిపోయింది.

వెంకట్రావ్‌కి సిగరెట్ పొగ పీల్చుతున్నా, ఆలోచన పోలేదు. సంశయాలు దొంతరలుగా తన మెదడులో యిరుక్కొని ఆలోచనకు అవకాశం యివ్వలేదు. ఇప్పుడెవరిదగ్గరవున్నట్టు అని అడగటానికికూడా నోరు పెగిలిందికాదు... తలెత్తి ప్రశ్నార్థకంగా చూడబోయాడు. గులాబిపువ్వుపై పొగ మంచు ప్రాకుకొనివుంది.

లోనుండి పిల్లాడు బాధపడుతున్నట్లు మూలుగు ఒక్కసారి వినపడింది. వెంకట్రావ్ ఆశాపూరిత హృదయం నిరాశ ధాటికి పగిలిపోయిందా అనిపించింది. ఏమడగటానికి శక్తిలేక తలవంచేశాడు. మళ్ళీ తలెత్తేసరికి యెదరగా సరోజలేదు. సరోజ మాటలు మాత్రం వినిపిస్తున్నయ్. దురాశతో బ్రతికేవాళ్ళకి నగ్నసత్యాన్ని గట్టిగా పలికినా ఇది నిజమా అన్న సంశయంమాత్రం కొట్లాడుతుంటుంది. లేవాలనుకున్న వెంకట్రావ్‌కు శక్తిలేకపోయింది. కుర్రాడ్ని బుజ్జగించిన సరోజ మళ్ళీవచ్చి నమ్రతతో నిల్చుంది.

ఈసారి వెంకట్రావ్ పిడికిలి పట్టాడు. ఎవరా అబ్బాయి అని ప్రశ్నించాడు. సరోజ మెల్లగా "ఆ అబ్బాయితల్లి చచ్చిపోయింది" వెంకట్రావ్‌కు యీ మాట లెంతో సుఖాన్నిచ్చాయ్. ఇక వెంకట్రావ్‌కు ఆ కుర్రాడి చరిత్రత్రవ్వే అవసరం లేకపోయింది. గొంతుకపట్టిన కోయిల మామిడిచిగుళ్ళ మందుతో గొంతువిప్పిన సమయమది. తన జీవితంలో వసంతమాస ఘడియలు!

పెద్దగాలివానలా అప్పుడేవచ్చి పడ్డాడొక వ్యక్తి. మనిషి నల్లగావున్నాడు. మాసిపోయిన కాకీనిక్కరు. నలుపునంటుకొనియున్న బట్టలతో వున్నాడు. తనకంటికి యేకోశాన సంస్కారంవున్న వ్యక్తిలా కనపడలేదు. ఆ సిండియాషిప్‌యార్డ్ కార్మికుని కలవరం వెంకట్రావ్‌కు యెంతో అసహ్యాన్నికలిగించింది. వచ్చినవెంటనే తనవేపు చూసిన చూపు వెంకట్రావ్‌కు తీరని అవమాన బాధకలిగించింది. అంతతో సరిపోలేదు. సరోజను తన నడత, మాటలతో అవమానపరచాడని వెంకట్రావ్ మనసులో మండిపోతున్నాడు. ఈ ఆకతాయి అర్థంలేకండా గాబరాపడుతూ తనహద్దును దాటిపోతున్నాడు. తనలో వుబికివచ్చే అసహనాన్ని కోపాన్ని ప్రవహించకుండా చేస్తోంది. సరోజ వాడియందు చూపించే విధేయతతో.

ఇంతకీ జరిగింది యిది. ఆ కార్మికుడు గదిలో కాలుపెట్టగానే వెంకట్రావ్ వేపుచూచి గబగబ జ్వరంలో బాధపడుతున్న కొడుకుదగ్గరకువెళ్లి బుజ్జగించాడు. వెనకనేవచ్చిన సరోజనుద్దేశించి సహజమైన వుత్కంఠతో "డాక్టరుకోసం పంపించావా లేదా ?" అన్నాడు. పొరుగు కుర్రాడ్ని బ్రతిమాలి ఫలానా డాక్టరుదగ్గరకు పంపించానంది. దానితో కార్మికుడు వెక్కెత్తిపోయాడు. "ఆ డాక్టరు మంచి డాక్టరుకాడు. వాడు నా కొడుకునకు మందివ్వటానికి వీల్లేదు...వీల్లేదు ... కుర్రాడిదగ్గరవుండు — మంచి డాక్టరును తీసుకవస్తాను..." అరుస్తూనే అంగటి గదిలోనికి వచ్చాడు. ఒక కారు రోడ్డువెంబడి వెళిపోవటం చూచి పరుగెత్తాడు. కారువెంట (డాక్టరుగారూ డాక్టరుగారూ)అంటూ కేకలు వేసుకుంటూ తను కోరిన డాక్టరుని తెచ్చుకోవటంలో కృతకృత్యుడయ్యాడు. డాక్టరుగారు వచ్చారు. పరీక్ష చేశారు. తనసంతి ఆతృతపడవద్దని,కొద్దిరోజుల్లో నేనయావతాతుందనిచెప్పి మందివ్వటాని తనతో కార్మికునికి కారులో తీసుకపోయాడు. వెళ్ళేముందు పిల్లాడిదగ్గర వుండుఅని సరోజతో చెప్పి మరీ వెళ్లాడు.

ఈ దృశ్యాలన్నీ కళ్లప్పచెప్పి హేతువాదానికి మనసులో తావివ్వకుండా వెంకట్రావ్ చూస్తున్నాడు. ఒక సేవకుడు ఒక మహారాజ్ఞిని ఆజ్ఞాపిస్తున్నాడు. అ మహారాజ్ఞి ఆసేవకుని ఆజ్ఞలను శిరసావహించటానికి కారణాన్నిమాత్రం ఆలోచించలేదు.

కుర్రాడు నిద్రపోతున్నాడు. సరోజమెల్లగా మొదటిస్థానానికివచ్చి నిల్చుంది. ఆ పలుకలేని పుత్తడిబొమ్మను చూడగానే వెంకట్రావ్ ఒళ్ళంతా పులకరించింది. ఈ అందాన్ని యీ లాలిత్యమైన పసుపుకుంకుమకళని ఆమె యిన్నాళ్లూ తనకోసమే దాచిపెట్టింది!

ఒక మొగలాయీ కాలపు మనోహరి చిత్రాన్ని చూస్తున్నట్లుగాని, సినీమాలో తనతోపాటు భర్తతోసహా సినీమా చూడడానికివచ్చిన ఒక

అందాలరాణివేపు చూస్తున్నట్టుగానీ లేక వర్ణించ లేని అందచందాలతో మిసమిసలాడే స్వంత చెల్లాయి వేపు చూస్తున్నట్టుగానీ వెంకట్రావ్ సరోజవేపు చూడలేకపోయాడు. ఆయనచూపు పదహారణాల స్వార్థంతో కూడివుంది. సరోజతనది, ముమ్మాటికీ ఆమె యౌవ్వనపు మధురమంతా గ్రోలేది తనేనని మోహంపులాలింపులో మోదపడుతున్నాడు.

సరోజ తలవని తలంపుగా ఒక ప్రశ్నతో తనని నిరాశవేపు బలవంతాన త్రోసి వేసింది. మూగ తనాన్ని మ్రింగి ఆమె ప్రశ్నించింది. "అక్కయ్యా, పిల్లలు బాగున్నారా?"

వెంకట్రావ్ యేవిధంగానూ జబాబు చెప్పలేక పోయాడు. ఈ విషయంనుంచి మనసు మళ్ళించటా నికి మాటలవరస మార్చబోయాడు. కానీ ఒక విషయం స్ఫురణకువచ్చి తను తనుభార్య మరణం చెప్తేగానీ తను తలపెట్టే మహాకార్యానికి నాంది ప్రస్తావనకాదని ఆ మరణవార్తని ముక్తసరిగా చెప్పాడు. మొదటిపెళ్లాం మరణవార్త తన రెండో పెళ్లికినాంది ప్రస్తావన!

సరోజ కలకలలాడి కళ్ళంటనీరు తెచ్చుకుంది. ఫలితాన్ని తెలుసుకోలేక యింతపని సరోజ చేసిం దని వెంకట్రావ్ విచారించాడు. ఈ విషయంనుంచి ఆమె మనస్సు మళ్లించి అసలు విషయానికి వద్దామను కొనేసరికి కుర్రాడు మూలుగు వినిపించింది.

సరోజ సుబగబవెళ్ళటం వెంకట్రావ్ కేమీ నచ్చిందికాదు. ఒకడిపిల్లాడికోసం ఆమె యెందుకంత ఆరాటపడాలి! ఆమె ఆరాటపడవలసినరోజులు ముందున్నాయ్.

ఈసారీ సరోజ కళ్ళు నీళ్ళతోనేవచ్చి నిల్చుంది. వెంకట్రావ్ మాట్లాడేముందుగానే ఆమె అంది—"ఆయనకు ఆ పిల్లాడితోనే అంతానా..."

ఈ సంబోధన వెంకట్రావ్‌కు నచ్చకపోవటం చేత యింకా ఆమె మాటాడబోతుంటే తను యెదురు ప్రశ్న వేసి ఆపాడు. సరోజ యీ ప్రశ్నకు జబాబు యివ్వలేదు. యిచ్చే అవసరంగాని విధంగానీ ఆమెకు తోచిందికాదు. ఆ యింట్లో ఆమె యెందుకుందో వెంకట్రావ్‌కుకావాలి. ఈ యిల్లు, తనజాతిగాని వాని యీ యిల్లు, ఆమె బంధువుతో యిది నా యిల్లని యెలా చెప్పగలుగుతుంది. ?

ఆమెకోరి ఆ కుర్రాడిగురించే మాట్లాడింది. "టిఫిన్‌కారియరు మోసుకెళ్ళేమనిషి కుర్రాడికి జ్వరంవచ్చిందని చెప్పివుంటుంది. భోజనం చెయ్య కండా పనివదలి పరుగెత్తుకొచ్చారు."

వెంకట్రావ్, "నా ప్రశ్నకు జవాబుచెప్పు సరోజా" అన్నాడు.

ఆమె వినిపించుకోనట్టే అన్నది. "పిల్లాడిని ప్రాణంగా చూచుకుంటే చచ్చిపోయినభార్య ఆత్మకు శాంతిగలుగ జేస్తామని ఆయన నమ్మకం!

వెంకట్రావ్‌కు సరోజలోని ఎస్కేపిజం నచ్చ లేదు. ఆమె తను మూడుసార్లు మురిడీపెట్టి అడిగిన ప్రశ్నకు జబాబు యీయకపోవటంతో, పంతం, పంతంతోపాటు ఫలితంయందు లేశమాత్రం అప నమ్మకంకలగటంచేత మనసులో విచారం, కోపం, అశాంతి, అసూయ ఒక్కసారి పెనవేసుకున్నాయ్. ఇప్పుడు తనుమనిషి! మనిషిలోని వివిధరకాలు అను భూతులు యిప్పుడే అతనిలో రేగినై! సరోజ తన ప్రశ్నకు జవాబు చెప్పాలి! చెప్పితీరాలి!

తను యింట్లో కాలుపెట్టినదగ్గిరనుంచీ జబాబు యెదురుగానేవుంది. తన మోహాంధకారంలో అగ పడలేదతనికి!

సరోజ కళ్లుకప్పుకొని అచ్చటినుంచి తిన్నగా కుర్రాడి మంచందగ్గరకు వెళిపోయి కూర్చుండి పోయింది. ఆమె వెక్కివెక్కి యేడుస్తోంది. ఆమె జీవితకాలంలో, చేసినతప్పులేమీ లేవు కానీ యిక ఆమెకు మిగిలిన జీవితంలో యేడుపేశరణ్యం! ఆ దుఃఖం కొంతచరిత్రను ఆమె నోటివెంబడి చెప్ప కండా దాచిపెట్టింది. అది వెంకట్రావ్ యిప్పుడు వూహించుకోవలసిన పరిస్థితివచ్చింది. వెంకమ్మ జబ్బులో పొరుగునవున్న యీ కార్మికుడు సహాయ పడ్డాడు. వెంకమ్మ చనిపోయింది. వాడికి భార్య లేదు. సరోజకు దిక్కులేరు. ఆకలిగొన్నకడుపు ఆకలిగొన్న యౌవ్వనంఒకటే! అందుకే యీ మహా రాణి ఆయన పాదాల నంటవలిసివచ్చింది. మేడ కూలేవరకూ పునాదులు కట్టలేదని తెలుసుకోలేక పోయాడు వెంకట్రావ్!

ఉద్రేకాలతో మానవత్వాన్ని మరిపించే ఘట్టాలు జీవితంలో క్షణికమైనవి. వాటిని నిరాశ వెన్నంటుతునే వుంటుంది. వెంకట్రావ్ వెళిపో తున్నానైనా సరోజతో చెప్పలేకపోయాడు. చేతిలో మందుసీసాతో పరుగునడకలతో తను యేకో శాన్నా సంస్కారం లేదనుకున్న కార్మికుడు వెళి పోతుంటే రిక్షామీదనుంచేచూసి సిగ్గుతో వెంక ట్రావ్ తలదించుకున్నాడు.

ఆయన జీవితంలో యింతకంటే మంచి ముహూర్తం అంటూ యికవుండదు. విజయవాడకు టిక్కెట్ తీసుకొని రైల్లో కూర్చున్నాడు. బరు వెక్కిపోతున్న తలను కిటికీమీదవాల్చి తల గోక్కుంటూ మనసులో బాధగా యేడ్చుకుంటూ అనుకున్నాడు—"నెలరోజులక్రితం నేనే చచ్చి పోయివుంటే...!!"

---